## శ్రీ కె. ప్రభాకర రెడ్డి

శ్రీ ప్రభాకర రెడ్డి ఆరవ శాసనసభ (1978-1983) డెప్యూటీ స్పీకర్‌గా 1978, మార్చి 28న ఏకగ్రీవంగా ఎన్నికై 1980, అక్టోబరు 16 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం కొహెడ గ్రామంలో 1935, ఆగస్టు 10న జన్మించారు. బి.ఎస్.సి. డిగ్రీని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తీసుకున్నారు. వీరు హయత్‌నగర్ పంచాయితీ సమితి అధ్యక్షులుగా పనిచేసారు.

శ్రీ ప్రభాకర రెడ్డి 1970 నుండి 1976 వరకు రాష్ట్ర విధాన పరిషత్తు సభ్యునిగా ఉన్నారు. వీరు 1972, మార్చి 20 నుండి 1973, జనవరి 18 వరకు శ్రీ పి.వి. నరసింహారావు మంత్రి వర్గంలో రవాణా శాఖ మంత్రిగా పనిచేసారు.

వీరు 1978వ సంవత్సరంలో శాసనసభకు జరిగిన ఎన్నికలలో హైదరాబాదు జిల్లా మలక్‌పేట నియోజక వర్గం నుండి శాసనసభకు మొదటిసారిగా ఎన్నికైనారు. రాష్ట్ర శాసనసభ డెప్యూటి స్పీకరుగా ప్రతిపక్ష పార్టీ నుండి ఏకగ్రీవంగా ఎన్నికై చరిత్రను సృష్టించారు. వీరు డెప్యూటీ స్పీకర్ హోదాలో 1978-1979 సంవత్సరములలో అర్జీల, విశేషాధికారాల కమిటీల అధ్యక్షులుగా ఉన్నారు. వీరు శ్రీ అంజయ్య మంత్రి వర్గంలో హోం, అడవుల శాఖ మంత్రిగా ఉండి, మంత్రి వర్గ పునర్వవస్థీకరణలలో ఆర్థిక శాఖకు మంత్రిగా మార్చబడినారు.

# శ్రీ కె. ప్రభాకర రెడ్డి డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, మీరు, సభానాయకులు, ప్రతిపక్ష నాయకులు – వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అంతా నన్ను అభినందిస్తూ కొన్ని మాటలు చెప్పారు. వాటికి నేను ఎంతవరకు అర్హుణ్ణో చెప్పలేను. వాటిని ఎంతవరకు రుజువు చేసుకోగలనో అర్థము కావడము లేదు. నిన్న సాయంకాలం నాలుగు గంటల వరకు – దీనికి నామినేషను ఫైలు చేసేవరకు నాకు తెలియదు. 4 గంటలకు శ్రీ లచ్చన్నగారు మీరు వచ్చి సంతకం పెట్టాలి అని చెప్పే వరకు నాకు తెలియదు ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ఇవ్వవలసిన ఓటు, ప్రాతినిధ్యం ఈనాడు దేశంలో అన్ని చోట్ల జరుగుతున్నా మన రాష్ట్రములో ప్రప్రధమంగా జరుగుతున్నదని మనవి చేస్తున్నాను. ఈ సందర్భములో సభానాయకులకు, పెద్దలందరికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

అధ్యక్షా, ఇదివరకు సభాపతి ఎన్నిక అప్పుడు ఉప సభాపతి ఎన్నిక అన్ని రాజకీయ పక్షాలు పెద్దలు కలిసి ఏకగ్రీవంగా ఎన్నికచేయడం ఈ సభకు ఒక మంచి సాంప్రదాయంగా నేను భావిస్తున్నాను. ప్రభుత్వ పక్షం వారికి, ప్రతిపక్షాల వారికి నేను హృదయపూర్వకంగా వందనాలు తెలుపుతున్నాను. ప్రజాస్వామ్య సాంప్రదాయాలు, ఈ సభా సాంప్రదాయాలు ఇది వరకు ఏ విధంగా జరిగాయో ఆ విధంగా జరపడానికి ప్రయత్నిస్తాననే హామీ ఇస్తున్నాను. నిష్పక్షపాతంగా, నిస్వార్థంగా సేవ చేసే మీ అడుగుజాడలలో నడుస్తానని మనవి చేస్తున్నాను. నా కంటే పెద్ద అనుభవజ్ఞులు, న్యాయ శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, రాజకీయరంగంలో సేవ చేసిన వారు ఎందరో ఉన్నప్పటికి ఈ అవకాశం నాకు కలుగజేయబడినందుకు ధన్యుణ్ణిగా భావిస్తున్నాను. సభా నాయకులు చెన్నారెడ్డి గారు నా గురించి చెబుతూ ప్రజాస్వామ్య కార్యక్రమాలు తెలిసిన వాణ్ణని చెప్పారు. వారి ఆశీర్వాదాలతోనే నేను రాజకీయ రంగంలో ప్రవేశించాను. 25 సంవత్సరాలుగా వారితో కలిసి జిల్లాలో నేమీ, రాష్ట్రంలో నేమీ పనిచేసే అదృష్టం నాకు కలిగింది. వారు నాయకుడుగా ఉన్న సమయంలోనే నాకు ఈ పదవి లభించడం గొప్ప విషయంగా భావిస్తున్నాను. లచ్చన్న గారు నా మీద ఇంత గౌరవం, విశ్వాసం చూపించడం, ఎందరో పెద్దలు ఉండగా నన్ను వారు ఏకగ్రీవంగా నిర్ణయించడం గొప్ప భాగ్యంగా భావిస్తున్నాను. నేను ఏక గ్రీవంగా ఎన్నిక కావడంలో సహకరించిన పెద్దలు, మిత్రులందరకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. తప్పనిసరిగా ప్రజాస్వామ్య సాంప్రదాయాలు, ఈ సభా సాంప్రదాయాలు కాపాడడానికి ప్రయత్నిస్తానని మనవి చేసుకుంటూ, అందరికి ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.